క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం మౌలాలీ విద్యుత్ సబ్ స్టేషన్ 11కేవీ ఆర్టీసీ కాలనీ ఫీడర్ పరిధిలో పలు కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్టీసీ కాలనీ, జెడ్.టి.సి. తిరుమలనగర్, హనుమాన్‌నగర్ గౌసియా మసిద్ ప్రాంతం, పోచమ్మ ఆలయం, కృష్ణానగర్, శివానందనగర్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరం

కాప్రా: వినికిడి లోపం, బాల్య వికాసంలో రుగ్మతులున్న వారి కోసం సోమవారం నుంచి వారం రోజుల పాటు హియర్ ఎన్ సే క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు. హియర్ ఎన్ సే క్లినిక్ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఏఎస్‌రావునగర్ డివిజన్ రాధిక థియేటర్ సమీపంలో ఈ నెల 19 వరకు వైద్యులు అందుబాటులో ఉండనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సీఐగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా రవికుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.రాచకొండ కమిషనరేట్ కౌంటర్ ఇంటలిజెన్స్ విభాగం నుంచి మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌కు ఈయన బదిలీయయ్యారు.

పోటీ పరీక్షలతో విజ్ఞానం



పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

రామంతాపూర్: ఈ అభ్యాస్ ఒలంపియాడ్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైష్ణవి హై స్కూల్‌లో నిర్వహించిన కే-శాట్ పోటీ పరీక్షలకు రాష్ట్రంలోని వివిధ పాఠశాలల నుండి 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలను స్కూల్ కరెస్పాండెంట్ ఎంఏ.కబీర్, ఒలంపియాడ్ వైస్ చైర్మన్ భువనగిరి సువర్ణ విడుదల చేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని సాయి బృందావన్ కాలనీలోని సాయినాథుడి ఆలయంలో స్వామివారి 16వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుండి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

యువతి వివాహానికి ఆర్థిక సాయం

కాప్రా: సాయిరాంనగర్ కాలనీకి చెందిన పేదింటి ఆడపడుచు వివాహానికి బీఎల్ఆర్ ట్రస్ట్ తరఫున ఆదివారం ఆర్థిక సాయం అందించారు. రాజేశ్వరి అనే మహిళ తన కూతురు పెళ్లి సందర్భంగా పేదింటి ఆడపడుచు వివాహానికి బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆర్థిక సాయం అందించారు. ఈ సొమ్మును ట్రస్ట్ ప్రతినిధి ఖైరి నవీన్‌గౌడ్ చేతుల మీదుగా రాజేశ్వరికి అందించారు. తమ కూతురు పెళ్లి సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి చేసిన ఆర్థిక సాయం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వెంకటేశ్వర దేవస్థానంలో ఆదివారం శ్రీవారి కల్యాణం ఘనంగా జరిగింది. కళ్యాణాన్ని ప్రధాన అర్చకులు ముదుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు నిర్వహించారు. ఈసారి 35 మంది దంపతులు కళ్యాణోత్సవంలో పాల్గొన్నారని ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ఉప్పల్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు.ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రామంతాపూర్ అరవింద్‌నగర్ ప్రాంతానికి చెందిన శంకరయ్య(57) ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి బయటు వెళ్లి తిరిగి రాలేదు. కల్లుకు బానిసైన శంకరయ్య తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజలకు సేవ చేయాలనే తపనతో..



నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్



నాచారంలో పూర్తయిన ఎస్టీపీ ప్లాంట్

మల్లాపూర్: ప్రజలకు సేవ చేయాలనే తపనతో రాజకీయాల్లోకి వచ్చానని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. కార్పొరేటర్‌గా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సాక్షితో పలు అంశాలను వివరించారు. ఎన్నికల్లో చేసిన హామీలన్నీ నేరవేరుస్తానని, దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తానని ఆమె తెలిపారు.

ప్రధాన సమస్యలు గట్టెక్కినట్టే

మురుగు జలాలను శుద్ధి చేయడం కోసం 30 కోట్లతో ఎస్టీపీ నిర్మాణం, రూ.4 కోట్లతో 5 పాత వంతెనల స్థానంలో నూతనంగా పనులు ప్రారంభం, రూ. 84 లక్షలతో ఇందిరానగర్‌లో సీసీ రోడ్లు, పటేల్ కుంట చెరువులోకి మురుగు నీరు చేరకుండా రూ.1.80 కోట్ల వ్యయంతో పైప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

డివిజన్ అభివృద్ధిలో లక్ష్యంగా పెట్టుకున్నవి

నాచారం డివిజన్‌లో పటేల్‌కుంట చెరువు సుందరీకరణ, ఎర్రకుంట హిందూ శ్మశాన వాటికకు వైకుంఠధామంగా తీర్చిదిద్దడం,, రైతు బజార్‌లో మల్టీ లెవల్ ఫంక్షన్‌హాల్ నిర్మాణం, ఏపీ ఫుడ్స్ గుడిసె వాసులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కట్టించడం, ఫుడ్ టెస్టింగ్ కార్యాలయం ప్రాంగణంలో 100 పడకాల ఆస్పత్రి,ఇందిరానగర్‌లో థీమ్ పార్క్‌ను తీర్చిద్దిడం లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

ఆరాధనోత్సవాలు



మల్కాజిగిరి: త్యాగరాజ ఆరాధనోత్సవ సమితి ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి 176 వ ఆరాధనోత్సవాలు ఆనంద్‌బాగ్‌లోని శంకర విద్యాపీఠం(కనకరాజు తోట)లో ఘనంగా జరుగుతున్నాయి. రెండవరోజు ఆదివారం జంట నగరాల నుంచి వచ్చిన వివిధ కళాకారులు త్యాగరాజస్వామి కీర్తనలతో పంచరత్న సేవ నిర్వహించారు.

మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తా



మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి.

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తానని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సాక్షితో మాట్లాడారు.

◆ మల్లాపూర్‌లో ప్రధాన సమస్య డ్రైనేజీ. గత ఎన్నికలలో డ్రైనేజీలను పూర్తి చేస్తానని ప్రజలకు ఇచ్చిన హామీలను రెండేళ్లలో పూర్తి చేశా. కోట్ల వ్యయంతో చేపట్టిన బాక్స్ డ్రైనేజీ,రోడ్డు పనులు బ్రహ్మపురి కాలనీ, గ్రీన్‌హిల్స్ కాలనీ, భవానీనగర్, చాణక్యపురి కాలనీ గుల్మోర్ గార్డెన్ పూర్తి చేశారు.

ఇంకా చేయాల్సిన పనులు..

మల్లాపూర్ ఎస్‌ఎఫ్‌సీ బిడ్జిని వెడల్పు చేయడం, థీమ్ పార్కులో వివిధ రాష్ట్రల నుంచి ఔషధ మొక్కలు తీసుకువచ్చి ఆహ్లాదకరంగా తయారు చేయడం. దుర్గనగర్, సింగం చెరువు తండాలో శ్మశాన వాటికల అభివృద్ధి, పాఠశాలల అభివృద్ధి, నిరుపేదల శుభకార్యాల కోసం మల్టీపర్పస్ బిల్డింగ్, సామాజిక భవనాలు నిర్మించడం.

మా సమస్యలు పరిష్కరించండి



మౌన ప్రదర్శనలో బాధితులు

బోడుప్పల్: తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వక్ఫ్ బోర్డు బాధితుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు వందలాది మంది మౌన ప్రదర్శన నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, కో చైర్మన్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డిలు మాట్లాడుతూ.. స్థలం కొనుక్కొని ఇళ్లు నిర్మించుకుని సంవత్సరాలు కావస్తోందని.. ప్రభుత్వం ఇప్పుడు వక్ఫ్ బోర్డు స్థలాలని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. జేఏసీ కో కన్వీనర్ రమేష్, నేతలు పోగుల నర్సింహారెడ్డి, కొత్త కిశోర్‌గౌడ్, వరలక్ష్మి మహిళలు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మహా లక్ష్మి హోమంలో పాల్గొన్న మహిళలు

ముగిసిన బ్రహ్మోత్సవాలు



శ్రీపుష్ప యాగంలో స్వామివారు

బోడుప్పల్: పన్నాల రవీందర్‌రెడ్డి కాలనీలోని శ్రీకృష్ణ దేవాలయం ఏకాదశ వార్షిక బ్రహోత్సవ ముగింపు వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ పన్నాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ ముగింపు ఉత్సవాల్లో భాగంగా మహా పూర్ణహుతి, మహా కుంభ ప్రోక్షణ, 108 కలశాలతో అభిషేకం, చక్రస్నానం, శ్రీ పుష్ప యాగంతోపాటు సేవా కాలం, మహాలక్ష్మి హోమం, దేవతో ద్వాసన, నివేదన, రుత్విక సన్మానం కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణం కొరకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: దేవేందర్‌నగర్ కాలనీలో శ్రీ కామరాతి సహిత బీరప్ప స్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులందరూ దైవ చింతన కలిగి మానసిక ప్రశాంతతో జీవించాలన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం పెద్దలు వాసూరి ఉప్పలయ్య, మరాటి మల్లేష్ పాల్గొన్నారు.

మహనీయునికి మణిహారం



మల్లాపూర్: మహనీయునికి మణిహారంలో భాగంగా జై భీమ్ ఆధ్వర్యంలో ఆదివారం 333వ వారం మల్లాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై జ్ఞానమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో పల్నాటి వెంకట్‌ప్రసాద్, కర్రె శంకర్, జై భీమ్ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పలువురి జన్మదిన శుభాకాంక్షలు



కుషాయిగూడ: ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు బండారి రాజిరెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హబ్సిగూడలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ సీనియర్‌నాయకులు, బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

పనులు ప్రారంభించండి



మేడిపల్లి: పీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ 110 కోట్ల తో నిర్మించ తల పెట్టిన వరదనీటి కాలువ (స్టాం వాటర్ డ్రైన్) నిర్మాణ పనులపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్‌ను కోరారు.

మందు బాబుల వీరంగం

మేడిపల్లి: బోడుప్పల్‌లోని కట్ట మైసమ్మ వైన్ షాప్ వద్ద మందు బాబులు వీరంగం సృష్టించారు. బీరు సీసాలతో ఒకరి పై ఒకరు దాడి చేసుకున్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చిలుకా నగర్ ప్రధాన రహదారిలో ఉన్న కట్ట మైసమ్మ వైన్‌షాప్ ముందు ఆదివారం సాయంత్రం మద్యం సేవించడానికి వచ్చిన యువకులు ఒకరితో ఒకరు గొడవకు దిగారు. దీంతో ఓవ్యక్తి బీర్ సీసాలతో యువకుడి తలపై దాడి చేసి వైన్స్ ముందు,రోడ్డుపై వీరంగం సృష్టించారు.ఈ ఘటనలో ఆ యువకుడికి గాయాలయ్యాయి.ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు స్థానికంగా సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఈ వైషాప్ ముందు మందు బాబుల హంగామతో గతంలో ఓ వ్యక్తి బస్సు ఢీ కొని చనిపోయాడు.

బీఆర్ఎస్ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న ప్రభాకర్

మల్లాపూర్: ప్రజా గోస- బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా నాచారం డివిజన్ నేతాజీ విగ్రహం భవానీనగర్‌లో నేతాజీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి నాచారం సమన్వయ కర్త రాగిరి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న నియంతృత్వ పాలన, కుటుంబ పాలనను వ్యతిరేకంగా పోరాడాలన్నారు. దేశంలో తొమ్మిది ఏళ్ల ప్రధాని నరేంద్రమోడీ పాలనలో ఒక్క అవినీతి మరక లేకుండా ప్రజల కోసం పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలు బూత్ అధ్యక్షులు ప్రకాష్, ప్రతాప్‌రెడ్డి, లోకేష్, బీజేపీ నాయకులు ప్రకాష్, పద్మారెడ్డి పాల్గొన్నారు.

ఐక్యతతో ఏదైనా సాధించవచ్చు: బండారు లక్ష్మారెడ్డి



శివసాయినగర్ కమ్యూనిటీ హాల్ భూమిపూజలో పాల్గొన్న బండారు లక్ష్మారెడ్డి.

కుషాయిగూడ: అందరూ కలిసికట్టుగా ఐక్యతతో ఉంటే అసాధ్యానికి తావులేకుండా ఏ పనైనా సునాయసంగా సుసాధ్యం చేయవచ్చని బీఆర్ఎస్ నాయకులు, బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారు లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం చర్లపలి డివిజన్‌లోన శివసాయినగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బీఎల్ఆర్ ట్రస్ట్ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



అన్నపూర్ణ కాలనీలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అన్నపూర్ణ కాలనీలోని ఉచిత షుగర్, కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటుచేసినందుకు నిర్వాహకులు శ్రీనివాస్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో లంబు శ్రీనివాస్‌గౌడ్, నెమలి అనిల్, కరాటే మల్లిఖార్జున్‌గౌడ్, కేశవరం ఆంజనేయులుచారి తదితరులు పాల్గొన్నారు.

హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలంటూ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సంఘం నేతలు

బోడుప్పల్: భారత రత్న బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలంటూ ఆదివారం బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘం నేతలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. బోడుప్పల్ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు చిన్నింగల్ల కుమార్, ప్రధాన కార్యదర్శి చీరాల జంగయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



కుషాయిగూడ: మధురచారిటబుల్ ట్రస్ట్, కిమ్స్ ఆస్పత్రి, సాధురం కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చర్లపల్లిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని మధురచారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. చర్లపల్లి వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య చికిత్సలు చేయించుకున్నారు.

పేదల సంక్షేమం కోరే పార్టీ కాంగ్రెస్



వెంకట్‌రెడ్డినగర్‌లో కాంగ్రెస్ జోడో యాత్ర

రామంతాపూర్: వెంకట్‌రెడ్డినగర్‌లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కాలేరు నవీన్‌ఆధ్వర్యంలో జోరుగా భారీ ర్యాలీలో నిర్వహించిన కాంగ్రెస్ జోడో యాత్రలో ఉప్పల్ నియోజకవర్గం ఏ-బ్లాక్ అధ్యక్షులు మందముల్ల పరమేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పేదల సంక్షేమం కోరే పార్టీ కాంగ్రెస్ ఒకటేనన్నారు. టీపీసీసీ ప్రతినిధి తోఫిక్, పసూల ప్రభాకర్‌రెడ్డి, ఆగిరెడ్డి, మురళి, రఫీక్, బాలరాజు, రఘు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌టీపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు



వైఎస్ఆర్‌టీపీలో చేరుతున్న రూపేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ ఉపాధ్యక్షులు కొకుంట్ల రూపేందర్‌రెడ్డి ఆదివారం వైఎస్ఆర్ తెలంగాణ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రూపేందర్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్ట రాంరెడ్డి, మేడ్చల్ జిల్లా కో-ఆర్డినేటర్ దేశిరెడ్డి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్ మిని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను అలరించాయి. హిందుస్తానీ వోకల్, కర్నాటిక్ వోకల్, సితార్, కథక్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. - ఉప్పల్